నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 13 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల మరమ్మతులో ఉండడంతో బడి బయటే అడ్మిషన్లు తీసుకుంటున్న ఉపాధ్యాయులు



తాండూర్‌లో తెలుగు-ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న మరుగుదొడ్ల పనులు

నమస్తే విజిట్ T MEDIA VISIT

# మోగిన సమస్యల గంట

## పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థుల అవస్థలు



నస్పూర్ విలేజ్‌లోని మండల విద్యా వనరుల కేంద్రం నుంచి పాఠశాలకు బుక్కులు మోసుకెళ్తున్న విద్యార్థి



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల హైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద జరుగుతున్న పనులు



దండేపల్లి మండలంలోని రాజుగూడ ప్రాథమిక పాఠశాలలో పనులు జరుగుతుండడంతో ఆరుబయట విద్యార్థులు, టీచర్



జన్నారం మండలంలోని పొనకల్ హైస్కూల్‌లో టాయిలెట్లకు రిపేర్లు



దండేపల్లి : కుంటలగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో చేపడుతున్న పనులు పూర్తి కాకపోవడంతో తట్రపోషగూడేనికి చెందిన విద్యార్థులు ఇంటికి వచ్చి ఆరుబయట ఆడుకుంటున్న దృశ్యం.



దండేపల్లి మండలంలోని తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో నిధులు లేక ఆగిన 'మన ఊరు-మన బడి' పనులు

- ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు
- బయటే అడ్మిషన్ల ప్రక్రియ.. చెట్ల కింద చదువులు..
- నిలిచిన 'మన ఊరు-మన బడి' పనులు
- నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులు
- పుస్తకాలు, బట్టలు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు
- బడుల పునఃప్రారంభం సందర్భంగా 'నమస్తే తెలంగాణ' విజిట్

మంచిర్యాల, జూన్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం అయ్యాయి. తొలిరోజే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. చాలా బడుల్లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన పనులు నిధులు లేక నిలిచిపోయాయి. ఇక, కొత్త ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. తరగతి గదుల నిర్మాణ పనులతోపాటు మరుగుదొడ్లు, నీటి కుళాయిలకు మరమ్మతులు చేస్తున్నారు. బడి ప్రారంభించే నాటికి పనులు పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడ్మిషన్లను కూడా బయట కూర్చొని రాయాల్సిన దుస్థితి నెలకొన్నది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి వెళ్లలేక చెట్ల కింద కూర్చున్నారు. 724 ప్రభుత్వ పాఠశాలల్లో 37,785.. 136 కేజీబీవీ, మోడల్, వెల్ఫేర్ స్కూళ్లలో 22, 960.. రెండు అన్ఎయిడెడ్ స్కూళ్లలో 1,170 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

### కొనసాగుతున్న పనులు

243 పాఠశాలల్లో చేపట్టిన 'మన ఊరు-మన బడి' పనుల్లో 123 బడుల్లో పనులు పూర్తి కాలేదు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ పనులను కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. ఇక అమ్మ ఆదర్శ పనులు 478 స్కూళ్లలో చేపట్టారు. 456 బడుల్లో తాగునీటి పనులు చేపట్టి 118 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. 210 స్కూళ్లలో మేజర్ అండ్ మైనర్ రిపేర్లు చేపట్టి 35 స్కూళ్లలోనే పూర్తి చేశారు. 444 స్కూళ్లలో చేస్తున్న టాయిలెట్స్ పనులను 100 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. విద్యుదీకరణ పనులు 187 పాఠశాలల్లో పూర్తికాగా 147 పాఠశాలల్లో చేయాల్సి ఉంది. ఇలా చాలా బడుల్లో పనులు పూర్తికాలేదు.

### తొలి రోజు పంపిణీతోనే సరి..

బడుల పునఃప్రారంభం సందర్భంగా అన్ని పాఠశాలల్లో పుస్తకాలు, స్కూల్ యునిఫామ్స్ పంపిణీ చేశారు. చాలా పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రెండు జతల బట్టలు కాకుండా ఒక జత బట్టలు మాత్రమే అందజేశారు. తొలి రోజు చాలా స్కూళ్లలో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పెట్టలేదు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఇవ్వలేదు. కొన్నిచోట్ల ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వకుండా మధ్యాహ్న భోజనం మాత్రమే అందజేశారు. దండేపల్లి మండలంలో 67 స్కూళ్లు ఉండగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు తొమ్మిది స్కూళ్లలో మాత్రమే పూర్తయ్యాయి. 12 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణ పనులు ఈ మధ్యే మొదలయ్యాయి. దీంతో ఈ స్కూళ్లలో విద్యార్థులు కొన్ని చోట్ల ఆరుబయట కూర్చోగా, మరికొన్ని చోట్ల పుస్తకాలు, బట్టలు అందజేసి ఇంటికి పంపించేశారు. 'మన ఊరు-మన బడి' కింద 19 స్కూళ్లకు మూడు చోట్ల మాత్రమే పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల నిధులు లేక పనులను ఆపేశారు. తాండూర్ మండలంలో 40 పాఠశాలల్లో ఆరు స్కూళ్లలోనే అమ్మ ఆదర్శ పనులు పూర్తయ్యాయి. 26 స్కూళ్లలో పనులు సాగుతున్నాయి. 'మన ఊరు-మన బడి'లో 14 స్కూళ్లకు 7 స్కూళ్లలోనే 100 శాతం పనులు అయ్యాయి. ఇలా ఏ మండలం తీసుకున్నా.. 75 శాతం స్కూళ్లలో పనులు జరుగుతున్నట్లు 'నమస్తే తెలంగాణ' పరిశీలనలో తేలింది.

### బదిలీలు, ప్రమోషన్ల హడావుడి

ఇలా పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో అలా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు అంటూ హడావుడి మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ సాగుతున్నది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులుసహా ఉపాధ్యాయులు అందరూ బిజీగా ఉన్నారు. బడుల పునఃప్రారంభం సందర్భంగా క్షేత్రస్థాయిలో బడులన్నింటినీ పరిశీలించాల్సిన జిల్లా స్థాయి ఉన్నతాధికారులు బదిలీలకు సంబంధించిన వెరిఫికేషన్‌లోనే ఉండిపోయారు. ఏదో ప్రారంభోత్సవానికి వచ్చి వెళ్లిపోయారే తప్ప బడుల పరిస్థితి ఏంటి అనేది ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు అధికారులు, ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లు ప్రారంభించినోళ్లు అన్ని వసతులు కల్పించడంలో విఫలమయ్యారంటూ పెదవి విరుస్తున్నారు. ఆరు బయట కూర్చొని చదువుకోవడం, ఆరు బయటే అడ్మిషన్లు చేయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా.. అధికారుల తీరు మారకపోతే స్కూళ్లలో ప్రవేశాల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. తొలి రోజు స్కూళ్లకు ఎంత మంది వచ్చారనే వివరణ కోసం 'నమస్తే తెలంగాణ' విద్యాశాఖ అధికారులను సంప్రదించగా.. బదిలీలకు సంబంధించిన వెరిఫికేషన్‌లో బిజీగా ఉన్నామన్నారు. సాయంత్రం వివరాలు ఇస్తామని చెప్పారు. ఆ వివరాల కోసం మరోసారి సంప్రదించే ప్రయత్నం చేయగా అధికారులు ఎవ్వరూ ఫోన్‌లు ఆన్సర్ చేయలేదు.

# పోడు భూముల జోలికి వెళ్లద్దు

- రైతులను వేధించొద్దు
- అటవీ శాఖ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలో అటవీ హక్కుల పట్టాలు ఇచ్చిన భూముల్లో కూడా అటవీ అధికారులు దౌర్జన్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, పోడు భూముల జోలికి వెళ్లద్దని కుమ్రం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ కృష్ణారావు, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంటలు వేస్తున్నందున అటవీ అధికారులు పోడు భూముల జోలికి పోవద్దని, ఎవరినీ వేధించవద్దని సూచించారు. కొత్త అడవులను కొట్టకుండా చూడాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఇంకా ఎందుకు పూర్తి కాలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లో మిల్లర్లు చెప్పినట్లు అధికారులు వింటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం సాధ్యమన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని మెడికల్ కళాశాలలో స్థానికులకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా చూడాలని అన్నారు. ఆసిఫాబాద్ నుంచి ఉట్నూర్ వెళ్లే రోడ్డు కు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.

### అటవీ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయి

**- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు**

జిల్లాలో నక్సలైట్లు తగ్గడంతో గిరిజనులపై అటవీ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ మండలంలోని కొత్తగూడ, రెబ్బెన, సిర్పూర్-టీ మండలంలోని ఇట్యాల్‌పాడ్, కాగజ్‌నగర్‌లోని అంకుసాపూర్, పెంచికల్‌పేట్‌లోని కొండపల్లి, తదితర గ్రామాల్లో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అంకుసాపూర్ పరిధిలో 2006లో దాదాపు 700 ఎకరాలకు అప్పటి ప్రభుత్వం అటవీ హక్కుల పత్రాలను ఇచ్చినప్పటికీ అటవీ అధికారులు ఆ భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారుల వేధింపులతో రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులను ఆపకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతుల భూముల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.

### అప్పపల్లి బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 12 : మండలంలోని అప్పపల్లిలోరూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న వంతెనను వర్షాలు తీవ్రమయ్యే లోపు పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వంతెన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆసిఫాబాద్ మండంలోని వాడిగూడలో అదనపు గదులను మంత్రి ప్రారంభించారు. స్వాగతం పలికిన ఓ చిన్నారిని మంత్రి ఎత్తుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనుసూయ (సీతక్క) పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లో రూ.25లక్షల తో నిర్మించనున్న ఆసిఫాబాద్ నూతన ప్రెస్ క్లబ్ భవనానికి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర రావు, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ , కాంగ్రెస్ నాయకురాలు సుగుణ తదితరులు ఉన్నారు.

# ఎంతటి వరదలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

- ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 44 మంది కానిస్టేబుళ్లతో ఫ్లడ్ రెస్క్యూటీం ఏర్పాటు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో మాక్ డ్రిల్
- కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ శ్రీనివాసులు



నీటిలో పడిన వ్యక్తి ని రక్షించడంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు



ఎల్లంపల్లి ప్రాజెక్టులో బోట్‌లో వెళ్తున్న కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్, ఏసీపీలు

హాజీపూర్, జూలై 12 : వర్షాకాలం దృష్ట్యా ఎంతటి వరదలనైనా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ రామగుండం కమిషనరేట్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ప్రాజెక్టులో ఫ్లడ్ రెస్క్యూ టీం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది వరదలు వచ్చినప్పుడు మంచిర్యాల జోన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వర్షాలతో వరదలు వస్తే ప్రజలను కాపాడేందుకు 44 మంది కానిస్టేబుళ్లకు హైదరాబాద్‌లోని ఎన్‌డీఆర్‌ఎఫ్ శిక్షణకేంద్రంలో ట్రెయినింగ్ ఇప్పించి ఫ్లడ్ రెస్క్యూటీంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు అప్రమత్తతలో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఆపదలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను వరదల నుం చి రక్షించేందుకు 10 మంది కూర్చునేందుకు వీలుగా ఉండేలా ఒక బోట్, 10 లైఫ్ బేస్, 50 లైఫ్ జాకెట్లు, 5 మెడికల్ స్ట్రెచర్లు, 4 కర్ర కోత మిషన్లను అందుబాటు లో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, రామగుండం సీఐ అజయ్‌బాబు, ఆర్ఐ శ్రీనివాస్, వామనమూర్తి, దామోదర్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్, రామగుండం ఎస్ఐ సతీశ్, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ మంగతో ఎన్డీఆర్ఎఫ్ టీం సభ్యు లు పాల్గొన్నారు.

# భీమారం అడవిలోకి చుక్కల దుప్పలు



వాహనం నుంచి అడవిలోకి వెళ్తున్న చుక్కల దుప్పలు

భీమారం, జూన్ 12 : మంచిర్యాల-చెన్నూర్ ఫారెస్ట్ కారిడర్ అభివృద్ధిలో భాగంగా అటవీ ప్రాంతంలోకి బుధవారం చుక్కల దుప్పులను మంచిర్యాల ఎఫ్ఆర్వో రత్నకర్‌రావు ఆధ్వర్యంలో వదిలారు. మంచిర్యాల రేంజ్ పరిధిలో ఉన్న చెన్నూర్ కారిడర్‌లోని భీమారం అటవీ ప్రాంతంలో 19 చుక్కల దుప్పులను వదిలినట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం డీర్ పార్క్ నుంచి వీటిని ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చి వదిలినట్లు తెలిపారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679